
ఆగని వైసీపీ నేతల ఆగడాలు

- రాంబిల్లి మండలంలో భూ కబ్జాలు
- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్
- భూ యజమానులకు బెదిరింపులు



.... వివరాలు మెయిన్‌లో

కష్టాలు తీరేదెన్నడో?



ఐదేళ్ల క్రితం కొట్టుకుపోయిన తాటి చెక్కల వంతెన ఇదే (ఫైల్ ఫొటో)

- చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న చెక్క వంతెన ఐదేళ్ల క్రితం కొట్టుకుపోయిన వైనం
- రంధ్రాలు పడిన పడవ, సొంతంగా తయారు చేసుకున్న ధర్మాకోల్ దిమ్మలపై రాకపోకలు
- ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం
- ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకోవాలని వేడుకోలు

రాంబిల్లి, ఆగస్టు 3:

వంతెన లేక మూలజంప గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. శారదా నది అవతల పంట పొలాలు ఉండడంతో నిత్యం నది దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గతంలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న తాటి చెక్కల వంతెన నది ఉధృతికి ఐదేళ్ల క్రితం కొట్టుకుపోయింది. దీంతో రైతులు పడవపై గాని, సొంతంగా ఎవరికి వారు తయారు చేసుకున్న ధర్మాకోల్ దిమ్మలపై గాని నది దాటుతున్నారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక రాకపోకలు సాగిస్తున్నారు.

మండలంలోని మూలజంప గ్రామంలో సుమారు రెండే వేల మంది జనాభా ఉన్నారు. గ్రామస్థులు వ్యవసాయం, పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరికీ శారదా నది అవతల పంట పొలాలు, పశువుల పాకలు ఉన్నాయి. దీంతో నిత్యం నది దాటాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో గ్రామస్థులు చందాలు వేసుకుని తాటి చెక్కలతో నదిపై తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఐదేళ్ల క్రితం నది ఉధృతంగా ప్రవహించడంతో ఈ వంతెన కొట్టుకుపోయింది. ఆ తరువాత మళ్లీ చెక్క వంతెన నిర్మించాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా ధర్మాకోల్ షీట్లతో తయారు చేసుకున్న దిమ్మలు, లారీ



పడవలో శారదా నదిని దాటుతున్న మూలజంప గ్రామస్థులు

ట్యూబ్‌లు, గ్రామానికి ఉన్న ఏకైక పడవపై రాకపోకలు సాగిస్తున్నామని వారు వాపోయారు. ప్రమాదమని తెలిసినా ప్రాణాలకు తెగించి నది దాటుతున్నామని తెలిపారు. పడవకు రంధ్రాలు పడడంతో గమ్ అతికించి ప్రయాణం ... మిగతా 8వ పేజీలో



ధర్మవరం అగ్రహారంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కోస్టల్ రొయ్యల పరిశ్రమ

కోస్టల్ రొయ్యల పరిశ్రమలో క్లోరిన్ లీకేజీ

- సుమారు 25 మంది కాంట్రాక్టు కార్మికులకు స్వల్ప అస్వస్థత
- ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన యాజమాన్యం
- చికిత్స అనంతరం తిరిగి పరిశ్రమకు తరలింపు

ఎస్.రాయవరం, ఆగస్టు 3: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కోస్టల్ రొయ్యల పరిశ్రమలో శనివారం క్లోరిన్ లిక్విడ్ లీకై సుమారు 25 మంది కాంట్రాక్టు కార్మికులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి అందిన సమాచారం ఇలా వుంది. ఫ్లోర్ క్లీనింగ్‌కు వాడే క్లోరిన్ డబ్బా లీకవడంతో అది పీల్చిన కార్మికులు కాస్త ఇబ్బందులకు గురవడంతో యాజమాన్యం ప్రతినిధులు వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని బయటకు తెలియనీయకుండా గుట్టు చప్పుడు కాకుండా కార్మికులను అడ్డరోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు కార్మికులను పరీక్షించి ఎటువంటి ప్రమాదం లేదని చెప్పి మందులు ఇచ్చి పంపించారు. అయితే స్వల్ప అస్వస్థతకు గురైన ఈ కార్మికులు తమ ఇళ్లకు వెళితే ఎక్కడ ప్రమాదం విషయం బయటకు తెలిసిపోతుందనుకున్నారో ఏమో గాని యాజమాన్యం ప్రతినిధులు వారిని ఆస్పత్రి నుంచి నేరుగా పరిశ్రమకు తీసుకువెళ్లిపోయారు. అయితే కొంత సమయానికి ప్రమాదం విషయం తెలియడంతో రొయ్యల పరిశ్రమకు వెళ్లి ప్రమాదం ఏ విధంగా జరిగిందని మేనేజర్ హరిని విలేకరులు ప్రశ్నించగా క్లోరిన్ డబ్బా తిరగబడిందని, అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని, అందరూ బాగానే ఉన్నారని చెప్పారు. ప్రమాదం విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ నేత గుర్రం రామకృష్ణ పరిశ్రమకు వెళ్లి మేనేజర్‌ను వివరాలు అడిగారు. అనంతరం అస్వస్థతకు గురైన కార్మికులను పిలిపించి ప్రమాదం గురించి అబద్ధం ఆరా తీశారు. క్లోరిన్ డబ్బా మూత తీసి ఉంచడం వల్ల లీకవడంతో దాని వాసనకు ఇబ్బంది పడినట్టు కార్మికులు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడుగగా బాగానే ఉందని చెప్పారు.

బెంబేలెత్తించే బీఎన్ రోడ్డు

అడుగడుగునా భారీ గోతులు

- ఇరుక్కుపోతున్న వాహనాలు
- మరమ్మతులకు గురవుతుండడంతో వాహనచోదకుల అవస్థలు



బీఎన్ రోడ్డు కొత్తకోట కోటవారి పొలాల వద్ద గొయ్యిలో ఊడిన వ్యాన్ చక్రాలు

రావికమతం, ఆగస్టు 3:

నర్సీపట్నం- భీమునిపట్నం (బీఎన్) రోడ్డులో రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు హడలెత్తిపోతున్నారు. ఈ మార్గంలో భారీ గోతులు ఉండడంతో వాహనాలు ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్నారు. ఎండైనా, వానైనా తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.



బీఎన్ రోడ్డు కొత్తకోట పెట్రోల్ బంకు వద్ద గొయ్యిలో కూరుకుపోయిన వ్యాన్

అసలే గోతులమయంగా ఉన్న బీఎన్ రోడ్డులో భారీ గ్రానైట్ ట్రాలర్లు తిరుగుతుండడంతో చెరువును తలపించే గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో ఇటుగా వచ్చే వాహనాలు గోతుల్లో కూరుకుపోతున్నాయి. దీని వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పనులు చేపట్టినా బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత ఛిద్రమై ఆ గోతుల్లో వర్షపు నీరు చేరింది. కొత్తకోట పెట్రోల్ బంకు వద్ద ఓ వ్యాన్ శుక్రవారం కూరుకుపోగా, కోటవారి పొలాల సమీపంలో శనివారం మరో వ్యాన్ వెనుక చక్రాలు ఊడిపోయి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయంగా ఉంటోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం గోతులనైనా పూడ్చాలని వారు కోరుతున్నారు.

దూర విద్య విద్యార్థుల అగచాట్లు

- డిగ్రీ, పీజీ విద్యార్థులకు గడిచిన రెండేళ్లుగా అందని ఓడీ, మార్కుల లిస్టులు
- సుమారు పది వేల మంది నిరీక్షణ
- టెంప్లేట్ డిజైన్‌లో జాప్యమే కారణం



విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని దూరవిద్యా కేంద్రం ద్వారా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు అధికారులు సకాలంలో సర్టిఫికెట్లు అందించడం లేదు. దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పలు డిగ్రీ, పీజీ కోర్సులను నిర్వహిస్తున్నారు. 2020-23 మధ్య సుమారు పది వేల మంది ఆన్‌లైన్‌లో నిర్వహించే డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరారు. వీరంతా ఇప్పటికే తమ కోర్సులను పూర్తిచేశారు. వీరికి సాధారణంగా కోర్సు పూర్తయిన రెండు నెలల్లో ఒరిజినల్ డిగ్రీలను అందించాలి. అలాగే, మార్కుల లిస్టులను అందించాలి. అయితే కోర్సులు పూర్తయి, ఫలితాలు విడుదలై నెలలు దాటుతున్నా విద్యార్థులకు అధికారులు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. ఇది ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఉద్యోగాలు, ఇతర అవసరాలకు ఆ సర్టిఫికెట్లను వినియోగించుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

సుదూర ప్రాంతాలు నుంచి రాక..

ఏయూ దూరవిద్యా కేంద్రం ద్వారా చదువుకునే వారిలో అనేక మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. వీరంతా సర్టిఫికెట్ల కోసం దూర విద్యా కేంద్రానికి వస్తున్నారు. అధికారులు సమయం పడుతుందని చెబుతుండడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. పీజీ కోర్సు పూర్తి చేసి ఆరు నెలలు అవుతోందని, సర్టిఫికెట్లు కోసం వస్తే సమయం పడుతుందని చెబుతున్నారని గుంటూరు జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి వాపోయారు. కంపెనీలో ప్రమోషన్ లభిస్తుందని పీజీ చేస్తే...సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఎక్కువ సమయం తీసుకోవడం వల్ల ఇబ్బంది అవుతోందంటూ పేర్కొన్నాడు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి శనివారం ఏయూ వీసీ శశిభూషణరావు దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. టెంప్లేట్ డిజైన్ చేయకపోవడం వల్ల ఇబ్బంది తలెత్తిందని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే అధికారులతో సమీక్షించానని, కొద్దిరోజుల్లోనే డిజైన్ పూర్తిచేసి విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీతోపాటు మార్కుల లిస్టులు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

అరకొర వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలు

నర్సీపట్నం ప్రాజెక్ట్ పరిధిలో 169 కేంద్రాలు

- అద్దె భవనాల్లో 82, సొంత భవనాల్లో 71, కమ్యూనిటీ హాల్స్‌లో 15, పిల్లలు లేక ఒకటి మూసివేత
- ఇరుకు గదుల్లో పిల్లల ఇబ్బందులు



నర్సీపట్నం వెంకునాయుడుపేటలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నర్సీపట్నం, ఆగస్టు 3:

నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కనీస వసతులు లేక, ఇరుకు గదుల్లో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేక నాలుగు గోడలకే పరిమితం అవుతున్నారు.

నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మాకవరపాలెం, నర్సీపట్నం రూరల్, మునిసిపాలిటీతో కలిపి 169 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సొంత భవనాలు ఉన్న సెంటర్లు 71, అద్దె భవనాలలో నిర్వహిస్తున్న సెంటర్లు 82 ఉన్నాయి. అద్దె లేకుండా ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్‌లో నిర్వహిస్తున్న కేంద్రాలు 15 ఉన్నాయి. మాకవరపాలెం మండలం బూరుగుపాలెం సెక్టార్‌లో పైలివాడ మినీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు లేక మూసేశారు. మిగిలిన 168 సెంటర్లలో 768 మంది గర్భిణులు, 599 మంది బాలింతలు, 6,667 మంది పిల్లలు సేవలు పొందుతున్నారు. అద్దె భవనాలలో నడుపుతున్న అంగ్‌వాడీ కేంద్రాలలో పిల్లలు ఆడుకోవడానికి కనీసం చిన్న స్థలం కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. మునిసిపాలిటీ పరిధిలో శారదానగర్, పాత వీర్రాజు థియేటర్, ఆలేటి జమ్మయ్య వీధి, పెదబొడ్డేపల్లి 4, 5 అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేక నాలుగు గోడల మధ్య ఉండిపోవల్సి వస్తోంది. అన్ని అద్దె భవనాల్లో స్థల సమస్య ఉంది. దీనికి తోడు శిథిల భవనాల్లో కొన్ని కేంద్రాలను నడుపుతున్నారు. అయ్యన్నపాలెం ఎంపీపీ స్కూల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డు లేవు. గుమ్మం, ఫ్లోరింగ్ గచ్చులు దెబ్బతిన్నాయి. లింగాపురంలో కూడా పాత ఎంపీపీ స్కూల్ భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అద్దె భవనాలకు రూ.3,10,150 లు ప్రతీ నెలా చెల్లిస్తున్నది. రెవెన్యూ అధికారులు 13 భవనాలకు స్థలాలు సమకూర్చడంతో ఐసీడీఎస్ అధికారులు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మిగిలిన కేంద్రాలకు స్థల సమస్య కారణంగా సొంత భవనాలు మంజూరు కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి

రాత్రిపూట బస చేసేందుకు ఏర్పాట్లు

- రివాల్వింగ్ రెస్టారెంట్ కూడా ఏర్పాటుచేస్తాం
- మధురవాడలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్
- మారికవలసలో ఐటీ పార్కు... నాలుగు టవర్ల నిర్మాణం
- వేర్వేరుచోట్ల లేఅవుట్లలో మిగిలిపోయిన వేయి ప్లాట్లకు త్వరలో వేలం
- మధ్య తరగతికి అందుబాటు ధరల్లో లేఅవుట్లు వేసే ఆలోచన
- చెరువులను సంరక్షిస్తాం
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని కైలాసగిరిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సిరిపురం ఉద్యోగ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కైలాసగిరిపై రాత్రి పూట ఉండడానికి కొన్ని నిర్మాణాలు చేపట్టామన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా రివాల్వింగ్ రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేస్తామని, ఎక్కువ మంది అక్కడికి వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

వీఎంఆర్‌డీఏకు ప్లాట్ల వేలం ద్వారానే అధిక ఆదాయం వస్తుందని, గత కొంతకాలంగా ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ఇప్పటివరకూ వేసిన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లు, ఆడ్ బిట్లు కలిపి సుమారు వేయి వరకు ఉన్నాయని, వాటిని త్వరలోనే వేలానికి పెడతామన్నారు. మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో లేఅవుట్లు వేసే ఆలోచన కూడా ఉందన్నారు. పాలవలస లేఅవుట్‌కు మంచి ఆదరణ లభించిందని, రఘుమండ, జియ్యమ్మవలస, గరివిడి, చోడిపల్లిలలో అభివృద్ధి చేస్తున్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో భూగర్భ కాలువలు, రహదారులు, తాగునీరు, విద్యుద్దీకరణ వంటి మౌలిక వసతులు వీలైనంత త్వరగా కల్పిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

చెరువులకు కొత్తరూపు

నగరం, పరిసర ప్రాంతాల్లో 520 వరకు చెరువులు ఉన్నాయని, అయితే చాలా వాటిలో నీరు లేదని, ఎండిపోయి మట్టితో పూడుకుపోయాయని, అటువంటివి ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడేందుకు జీవీఎంసీతో కలిసి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అవి మళ్లీ నీటితో కళకళలాడేలా, జన సందర్శనకు వీలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ తరహా పనులు కొన్ని స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని, వాటి సాయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆక్రమణలకు గురైన, నిర్మాణాలు జరిగిన చెరువుల జోలికి వెళ్లబోమన్నారు. వర్షం పడితే చెన్నై, బెంగళూరు వంటి నగరాలు నీటిలో మునిగిపోతున్నాయని, విశాఖపట్నానికి అటువంటి సమస్య రాకుండా ఉండేందుకు ముందుచూపుతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ఐటీ పార్కులో నాలుగు టవర్లు

మారికవలసలో హరిత ప్రాజెక్టు సమీపాన వీఎంఆర్‌డీఏకు 20 ఎకరాల వరకు ఉందని, అందులో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించి పనులు ఆపేశారని, దానిని మళ్లీ ఇప్పుడు పునరుద్ధరణ చేయబోతున్నామన్నారు. ఐటీ సంస్థలకు ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో ఇచ్చేలా నాలుగు టవర్లు నిర్మించాలని యోచిస్తున్నామన్నారు. ఒక టవర్‌లో 31 అంతస్థులు నిర్మించాలనే ఆలోచన ... మిగతా 8వ పేజీలో

మెట్రో రైలుకు మరో అడ్డంకి

కొత్త మొబిలిటీ ప్లాన్ కోరిన కేంద్రం

- ఇంతకు ముందు సమర్పించిన ప్లాన్‌కు కాలదోషం
- మళ్లీ సర్వేలు, ట్రాఫిక్‌పై అధ్యయనం తప్పనిసరి
- 2018లో టీడీపీ హయాంలో ఒకసారి తయారీ
- ఆ తరువాత వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో ముగిసిన కాలపరిమితి



• 7లో

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

క్రైం... crime news

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

హుకుంపేట ఆగస్టు 3: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం హుకుంపేట సాయిబాబు వీధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక సాయిబాబు వీధికి చెందిన మజ్జి కృష్ణ(34), సుజాత దంపతుల కుమారుడు ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో కృష్ణ అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. శుక్రవారం ఎవరూ ఇంట్లో లేని సమయంలో దూలానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఆరు గంటలకు పనుల నుంచి ఇంటికి వచ్చి అతని భార్య సుజాత ఎన్నిసార్లు పిలిచినా తలుపు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో బలవంతంగా తలుపులు తెరిపించింది. దూలానికి ఉరివేసుకుని ఉన్న కృష్ణ మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం కేసు నమోదు చేసి మృతదేహానికి పాడేరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

» వివాహిత అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

డుంబ్రిగుడ, ఆగస్టు 3: మండలంలోని బల్లుగుడ సమీపంలో గత నెల 31న అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటనపై దర్యాప్తు చేయగా ఆమె భర్తే హతమార్చినట్టు తేలిందని స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. డుంబ్రి గుడ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 31న బల్లుగుడ గ్రామానికి చెందిన నిందితుడు శెట్టి రాజ్‌కుమార్ తన భార్య దేవిని హత్య చేసి పరారయ్యాడన్నారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా, ఆమె భర్త హత్య చేసినట్టు దర్యాప్తులో రుజువు కావడంతో ఒడిశా వైపు నుంచి వస్తున్న అతనిని జైపూర్ జంక్షన్‌లో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా

» ప్రమాదం నుంచి బయటపడిన డ్రైవరు


బీఎన్ రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో తాచేరు వంతెన సమీపంలో శనివారం ట్రాక్టరు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నుంచి డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వీరవల్లి అగ్రహారానికి చెందిన డ్రైవరు నానాజీ విజయరామరాజుపేటలో వరి పొలం దమ్ము కైసెట్‌తో బీఎన్ రోడ్డుపై వడ్డాది నుంచి ట్రాక్టరుతో వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారి ఇచ్చే క్రమంలో రోడ్డు పక్కగా ట్రాక్టరును పోనిచ్చాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాగా తడిసి ఉండడంతో రోడ్డు చివర జారిపోవడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ పక్కనే గుంతలోకి బోల్తా పడింది. ట్రాక్టర్ కింద చిక్కుకున్న డ్రైవర్‌ను వాహనదారులు బయటకు తీశారు. ప్రమాదం నుంచి నానాజీ బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భార్యను గాయపరిచిన భర్త అరెస్టు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 3: మండలంలోని కోనేపాలెంలో భార్యను కత్తితో గొంతు కోయడానికి ప్రయత్నించిన భర్తను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్టు స్థానిక సీఐ ఎం.బుచ్చిరాజు తెలిపారు. జూలై 30న రాత్రి సమయంలో భార్య భారతిని భర్త వినయ్ కత్తితో గాయపరిచాడు. భార్యను గాయపరిచిన భర్త వినయ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఇదే కేసులో భారతిని కులం పేరుతో దూషించిన అత్త భూలక్ష్మి, రాజమ్మలపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

బయ్యవరం వార్డు మెంబరు ఆత్మహత్య


మృతుడు గొల్లవిల్లి బాబూరావు (ఫైల్)

కశింకోట, ఆగస్టు 3 : బయ్యవరం వార్డుసభ్యుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బయ్యవరం పంచాయతీలో 4వ వార్డు మెంబరు గొల్లవిల్లి బాబూరావు (45) సర్వే నంబరు 299లో ఉన్న చెరువు స్థలంలో స్వీటు షాపు నిర్మించుకున్నాడు. ఇది అక్రమ నిర్మాణమని తెలియజేస్తూ రెవెన్యూ అధికారులు గతంలో రెండు దఫాలు నోటీసులు ఇచ్చారు. ఎంతకీ స్పందించకపోవడంతో మూడో నోటీసు శుక్రవారం ఆ షాపు గోడకు అతికించారు. దీంతో షాపును తొలగించేస్తారేమోనని తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఉదయం 10 గంటలకు బాబూరావు ఉరి వేసుకున్నాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య దుర్గలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా గ్రామంలోని చెరువును ఆక్రమించి అక్రమంగా వేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారందరూ తమ సొమ్ము తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో వార్డు మెంబరు బాబూరావు ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్థులు అంటున్నారు. లేఅవుట్ వేసేందుకు ప్రోత్సహించిన వైసీపీ నాయకుడు చేతులెత్తేయడంతో బాబూరావు మృతి చెందాడని వారంటున్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం


మండల మహేశ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 3 : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి పాతరాజన్నపాలెం గ్రామానికి చెందిన మండల మహేశ్ (32) రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి జారిపడ్డాడు. దీంతో ఇతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు షీలానగర్‌లో గల డెయిరీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మహేశ్‌కు బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు, వైద్యుల సలహాతో అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. ఆదివారం కుటుంబసభ్యుల సమక్షంలో మహేశ్‌కు చెందిన అవయవాలను సేకరించనున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ప్రక్రియ అనంతరం మహేష్ మృతదేహాన్ని గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తాను మరణించి మరొకరికి ఇవ్వడానికి సహకరించిన మహేశ్ కుటుంబసభ్యులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మహేష్ వివాహితుడు. ఇతనికి తల్లి ముత్యాలమ్మ, ముగ్గురు అక్కచెల్లెలు ఉన్నారు. తండ్రి ఎరునాయుడు గతంలో చనిపోయారు.

బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ పలాస చేరే వేళలు సవరింపు

విశాఖపట్నం, ఆగస్టు 3: విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 18526 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు పలాస స్టేషన్ చేరే సమయాన్ని సవరించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈ రైలు మధ్యాహ్నం 3.00 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.43 గంటలకు పలాస చేరి, తిరిగి అక్కడ నుంచి 6.48 గంటలకు బయలుదేరే విధంగా మార్పు చేసినట్టు పేర్కొన్నారు. సవరించిన వేళలు ఈనెల 15 నుం చి అమల్లోకి వస్తాయన్నారు. అలాగే గుణుపూర్ నుం చి సంబల్‌పూర్ సిటీ వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) రైలు పలాస నుంచి పలు స్టేషన్లకు చేరే వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్టు వివరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఫార్మా.. ఇదేం ఖర్మ..

» కలుషితమవుతున్న భూగర్భ జలాలు
» ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలు
» తూతూ మంత్రంగా పీసీబీ తనిఖీలు

తరచూ ఫార్మా వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారబోత


పరవాడ మల్లోడిగెడ్డలోకి ఫార్మా వ్యర్థాలు విడిచిపెట్టడంతో నల్లగా మారిన నీరు (ఫైల్‌ఫొటో)

పరవాడ, ఆగస్టు 3: మండలంలోని విశాఖ ఫార్మాసిటీ (రాంకీ) పరవాడ ప్రాంత ప్రజలకు గుదిబండలా తయారైంది. ఇటీవల కొన్ని ఫార్మా యాజమాన్యాలు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నాయి. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. పీసీబీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు.


ఫార్మా వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు (ఫైల్‌ఫొటో)

ఫార్మాసిటీలోని కొన్ని కంపెనీల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు పరవాడ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. ప్రాణాలకు హాని కలిగించే వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నాయి. దీనివల్ల భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు జీవరాసులు కూడా మృత్యువాత పడుతున్నాయి. పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలను పరవాడ మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లడంతో పాటు నీరంతా కలుషితమైన సంగతి తెలిసిందే. ఇదే గెడ్డలోంచి నీరంతా దిగువ ఉన్న పెద్ద చెరువులోకి కలవడంతో అందులో చేపలు మృత్యువాత పడ్డాయి. అలాగే చెరువులోని నీరంతా పూర్తిగా కలుషితమైంది. దీనివల్ల ఆయకట్టు రైతులు చెరువు నీటిని పంటలకు మళ్లించేందుకు వెనుకాడుతున్నారు. చెరువులోకి దిగడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా ప్రబలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. దీనికి అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే పెదముషిడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సమీపంలోని బచ్చల చెరువులో ఫార్మా వ్యర్థాలతో నిండిన డ్రమ్ములను విడిచిపెట్టారు. డ్రమ్ముల్లో గల కొంత వ్యర్థాలను చెరువులోకి పారబోయడంతో చుట్టు పక్కల ఉన్న వారంతా దుర్వాసనకు తట్టుకోలేక విలవిలలాడిపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో డ్రమ్ములను రాంకీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అలాగే మూడు రోజుల క్రితం రాంకీ పంపుహౌస్ సమీపంలో గల గెడ్డలోకి కొన్ని ఫార్మా యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలు విడిచిపెట్టడంతో సమీపంలో ఉన్న తాడి గ్రామస్థులు వ్యర్థ జలాల దుర్వాసన తట్టుకోలేకపోయారు. తరచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యర్థాలను రాంకీలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాత్రి వేళల్లో కాలువల ద్వారా గెడ్డలోకి విడిచిపెట్టి చేతులు దులుపేసుకుంటున్నారు. దీనికి కారణంగా పరవాడతో పాటు పరిసర ప్రాంతాలన్నీ ఫార్మా వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

తూతూ మంత్రంగా పీసీబీ తనిఖీలు

ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నప్పటికీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు (పీసీబీ) అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి, చేతులు దులుపేసుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని యాజమాన్యాలు ఇష్టం వచ్చినట్టు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను విడిచిపెడుతున్నాయి. పీసీబీ అధికారులు నిఘా పెట్టి ఎవరైతే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారో వారిపై క్రిమినల్‌కేసులతో పాటు సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలకు పెనాల్టీ, కఠగారం సీజ్ చేసినట్టయితే వారి ఆగడాలకు కళ్లెం పడేది. ఆ దిశగా పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. పీసీబీ అధికారులు ఉదాసీనత కారణంగానే పరవాడ ప్రాంతం ఫార్మా కాలుష్యంతోనే నిండిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఫార్మా యాజమాన్యాల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

మరిడిమాంబ అమ్మవారికి ఆభరణాల వితరణ

» బంగారు పూతతో 50 తులాల వెండి వస్తువులు


అమ్మవారికి ఆభరణాలు వేసి పూజలు చేస్తున్న దాతలు (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి వితరణగా ఇచ్చిన వస్తువులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3: గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మ వారికి శనివారం ఇద్దరు దాత ఆభరణాలను వితరణగా అందిం చారు. ఏఎల్ పురా నికి చెందిన ఆటో మెకానిక్ తానారి శివ, ఎలక్ట్రీషియన్ తానారి నాయుడు సుమారు 50 తులాల వెండి ఆభరణాలను తయారీ చేయించి వాటికి బంగారుపూత వేయించి అమ్మవారి ఆలయానికి అందించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ అడ్మిషన్‌లకు 28 చివరి తేదీ

» డీఈఓ వెంకటలక్ష్మమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 28 చివరి తేదీ అని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం జరిగిన సమావేశంలో డిప్యూటీ డీఈఓ పి. అప్పారావు, జిల్లా కో-ఆర్డినేటర్ ఓ. కుమార్, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లు స్వాహా కేసులో నిందితుడి కోసం గాలింపు

» ముమ్మరంగా దర్యాప్తు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేసి పరారైన ప్రబుద్ధుడి కోసం ఎంవీపీ పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్ వ్యవహారాలు చూసేందుకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం బారినపడడంతో 2016లో తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన కుమార్తె ద్వారా కొంతకాలంపాటు వ్యాపారం నడిపించారు. అయితే ఆమె నగరానికి రావడం సాధ్యం కాకపోవడంతో స్టోన్ క్రషర్‌ను నాలుగు కోట్ల రూపాయలకు విక్రయించారు. ఆ సొమ్మును తన ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు, తప్పుడు డాక్యుమెంట్లతో రాధాకృష్ణమూర్తి ఖాతాలోని దాదాపు నాలుగు కోట్ల రూపాయలను అకౌంటెంట్ గోవింద్ తన ఖాతాలకు మళ్లించుకున్నాడు. దీనిపై రాధాకృష్ణమూర్తి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో రాధాకృష్ణమూర్తి జూన్ 12న అప్పటి సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిశారు. అలాగే ఇటీవల ఆయన అల్లుడు అప్పయ్య చౌదరి ప్రస్తుత పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీపీ వెంటనే ఎంవీపీ సీఐ సంజీవరావుకు ఫోన్ చేసి కేసు దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితుడి ఆచూకీ తెలుసుకునేందుకు వారి కుటుంబ సభ్యుల సెల్ ఫోన్ కాల్ డేటా, నిందితుడి బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని ఆదేశించారు.

ఈ మేరకు సీఐ సంజీవరావు శుక్రవారం సీతమ్మధారలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లి బాధితుడి బ్యాంకు ఖాతాతో పాటు నిందితుడి గోవింద్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. తదుపరి దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

మెట్రో రైలుకు మరో అడ్డంకి

» కొత్త మొబిలిటీ ప్లాన్ కోరిన కేంద్రం
» ఇంతకు ముందు సమర్పించిన ప్లాన్‌కు కాలదోషం
» మళ్లీ సర్వేలు, ట్రాఫిక్‌పై అధ్యయనం తప్పనిసరి
» ప్రాజెక్టు ప్రారంభం ఆలస్యం అయ్యే అవకాశం

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కేలాలేదు. వైసీపీ ప్రభుత్వం విశాఖలో మోనో రైలు నడుపుతామంటూ ప్రగల్భాలు పలికింది. అంతకు ముందు ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రివైజ్ చేసి పంపాలని కేంద్ర ప్రభుత్వం కోరితే...నాలుగేళ్లు దానిని తొక్కి పెట్టి ఎన్నికల ముందు సమర్పించింది. దానిని పరిశీలించేలోగా ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారిపోయింది. తాజాగా రాజ్యసభలో ఓ ఎంపీ విశాఖపట్నం మెట్రో రైలు పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నించారు. దానికి దిమ్మ తిరిగే సమాధానం వచ్చింది. ప్రాజెక్టుకు రివైజ్డ్ డీపీఆర్ అయితే పంపించారు గానీ దానికి జత చేసిన కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)కి కాలదోషం పట్టిందని, కొత్తది పంపాల్సి ఉందని తేల్చి చెప్పింది.

ఏమిటీ మొబిలిటీ ప్లాన్?

విశాఖ నగరంలో జనాభా, ప్రజా రవాణా వ్యవస్థకు సంబంధించిన ఏర్పాట్లు, రహదారుల సంఖ్య, వాటి విస్తీర్ణం, వాహనాల సంఖ్య, వార్షిక పెరుగుదల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా చేపట్టిన చర్యలు, మెట్రో రైలు ప్రాజెక్టుతో వాటికి అనుసంధానం ఎలా?...అనే వివరాలు సమర్పించేదే మొబిలిటి ప్లాన్.

తెలుగుదేశం పార్టీ 2017లో విశాఖపట్నం మెట్రో రైలును ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా ప్రకటించింది. 2108లో అధ్యయనం చేసి మొబిలిటీ ప్లాన్ తయారుచేసింది. మొత్తం 42.54 కి.మీ. పొడవున ట్రాక్ నిర్మించాలని ప్రతిపాదించింది. దీనికి అప్పట్లో రూ.8,300 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా సమకూర్చాల్సిన రూ.4,200 కోట్లను దక్షిణ కొరియాకు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని భావించారు. టెండర్లు పిలిచారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టు వ్యయం రూ.14,300 కోట్లకు చేరింది. మొబిలిటీ ప్లాన్ కాల పరిమితి ఐదేళ్లు. 2018లో రూపొందించినది కాబట్టి దాని గడువు 2023తో ముగిసిపోయింది. ఈ ప్రాజెక్టు ఇంకా డీపీఆర్ పరిశీలనలో ఉన్నందున కొత్త మొబిలిటీ ప్లాన్ సమర్పించాలని కేంద్రం సూచించింది.ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలని భావిస్తోంది. నగరంలో ట్రాఫిక్ సజావుగా సాగడానికి 12 ఫ్లైఓవర్లు నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించగా జాతీయ రహదారుల సంస్థ వాటికి ఆమోదం తెలిపింది. త్వరలోనే వాటికి టెండర్లను పిలిచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున, ఆ ఫ్లైఓవర్లు, మెట్రో రైలు స్టేషన్లను ఇంటిగ్రేట్ చేస్తూ కొత్త ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విశాఖపట్నం వచ్చినప్పుడు మెట్రో రైలు అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల నిర్మాణం మంచిదా?, ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే మంచిదా? ఆలోచించి తనకు చెప్పాలని కోరారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇబ్బంది లేకుండా మార్పులు చేయాలని సూచించారు. అంటే కేంద్రం కోరిన మొబిలిటీ ప్లాన్ కూడా ఇందులో కీలకం కానుంది. నగరంలో బీఆర్‌టీఎస్ రహదారులు, వాహనాల సంఖ్య, ఏయే జంక్షన్లలో ఎంతెంత ట్రాఫిక్ ఉంటున్నదీ కొత్తగా అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా మెట్రో రైళ్ల సంఖ్య, వాటికి బస్సుల అనుసంధానం వంటివి సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ పరిశీలించాకే కేంద్రం నుంచి ఆమోదం లభిస్తుంది. అప్పుడు పీపీపీలో చేయడానికి ఎవరు ముందుకు వస్తారనేది తేలుతుంది.

చెక్కపైనా స్నేహితులే


దార్ల రవి ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని చెక్కపై స్నేహితులను తయారు చేసిన దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 3: ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కపై స్నేహితులదృశ్యాన్ని అద్భుతంగా తయారు చేశారు. కష్టంలో వున్న వారిని ఆదుకోవడానికి నిజమైన స్నేహితులు ఎంత భారమైనా మోస్తారనే భావం వచ్చేలా చెక్కతో స్నేహితులను చిత్రీకరించాడు. దీనిని తయారు చేయడానికి సుమారు గంట సమయం పట్టిందని దార్ల రవి చెప్పాడు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

» ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం కూటమి నేతలంతా కలిసి పనిచేయాలని ఎంపీ సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ క్రియాశీలక నాయకులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలకు జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టినా గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని నేతలకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు కూటమి ప్రభుత్వం గుర్తింపునిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారని, వారి వివరాలను కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నేతలు హాజరయ్యారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించని అధికారులపై కేసులు

» ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దేవరాపల్లి, ఆగస్టు 3: ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించని అధికారులపై కేసులు ఎందుకు పెట్టకూడదంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ప్రశ్నించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.129 కోట్లు బకాయిలు చెల్లించని అధికారులపై ఎందుకు కేసులు పెట్టకూడదన్నారు. 15 రోజులకు ఒక సారి బిల్లులు చెల్లించకుంటే సంబంధిత అధికారులపై కూలీలు కేసులు పెట్టవచ్చని ఉపాధి హామీ చట్టం చెబుతోందన్నారు. అనకాపల్లి మండలంలో రూ.9,33,74,665, వి.మాడుగుల మండలంలో రూ.7,1978483, అచ్యుతాపురం రూ.2,24,10485, బుచ్చయ్యపేట రూ.4,3595072, దేవరాపల్లి మండలం రూ.2,78,89,860, చీడికాడ రూ.4,39109,98, కె.కోటపాడు రూ.4,38,564 చొప్పున జిల్లా వ్యాప్తంగా బకాయిలు కోట రూపాయాల్లో ఉన్నాయన్నారు. ఈసారి బడ్జెట్‌లో కూడా ఉపాధి హామీకి రూ.86 కోట్లుకు కుదించడం అన్యాయం అన్నారు.

CLASSIFIEDS

ASTROLOGY

★ ICAS వైజాగ్ * జ్యోతిష్యం * వాస్తు * హస్తరేఖ సర్టిఫైడ్ డిప్లమో కోర్సులు * ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ * అడ్మిషన్లు జరుగుచున్నవి. క్లాసులు ప్రతీ శని, ఆదివారాలలో @ గాయత్రి కాలేజ్, ద్వారకానగర్ & @ అమర్ కాన్సెప్ట్ స్కూల్ NAD కొత్తరోడ్. J. శ్రీనివాస్. ✆ 9966666659, 9441389808. www.icasindia.org AJV_192562

★ శ్రీ సాయి రాఘవేంద్రస్వామి జ్యోతిషాలయం : విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఆరోగ్యం, స్త్రీ పురుష వశీకరణ, ప్రేమ, పెళ్ళి, భార్యాభర్తల గొడవలు, మీ A to Z వ్యక్తిగత సమస్యల శాశ్వత పరిష్కారానికి సంప్రదించండి. వి.రామచంద్రశాస్త్రి పాతగాజువాక. సంప్ర: 9963273023. AJV_192578

EDUCATION

HOME TUITIONS

★ S.S. HOME TUITIONS. KG to PG, SSC / CBSE / ICSE, Inter (IIT / NEET / EAMCET, +1, +2), Diploma & B.Tech (All Bran). Want M/F. Cont.: 7799885853, 8309358985 AJV_192989

REAL ESTATE

FLATS FOR SALE

★ Gated Community Premium Deluxe Flats Ready to occupy 2 BHK 1250 sft. & 3 BHK 1512 sft. E/F No GST @ Madhurawada. Ph: 70134 09070, 93229 95678 AJV_183186

★ Ready to Occupy 2BHK 1030 Sft East & West Facing Flats for Sale & Pollutions Free Zone in Highway Facing Layout at TAGARAPUVALASA, Cont : 9866746418. AJG_2136

PLOT FOR SALE

★ చినముషిడివాడ శారదాపీఠం దగ్గర సాయినగర్‌లో 167 చ॥గ॥ N/F బిట్టు & చినముషిడివాడ శారదాపీఠం దగ్గర 210 గ॥ 3 BHK G+3 లిఫ్ట్ / గ్రూప్ హౌస్ అమ్మకం. సంప్ర॥ 9160065707, 6302092839 AJV_192559

★ విశాఖ NAD Jn. కి 18 కి.మీ. దూరం గుల్లేపల్లి నందు గజం రూ.6,750/- & సబ్బవరం నందు గజం రూ.13,999/-కి ఇళ్ళ స్థలములు అందుబాటులో కలవు. ఫోన్ : 6304924981. AJV_192898

★ Vuda 538 sq.yds (269x2) West Facing, 50 ft. Road, Padmavati Nagar, Walkable to Vepagunta to Simhachalam 200 ft. BRTS Road. Cont.: 8309494629, 9885180930 AJV_192580

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663 AJH-4211

TO-LET

★ 20000 sft. 5 అంతస్తుల భవనం అద్దెకు VIP రోడ్, ప్రైమ్ ఏరియా, వైజాగ్, దయచేసి 7674829531, 89787 81114 లో సంప్రదించండి. AJV_192575

WANTED TEACHERS

★ Wanted Teachers Higher English and Social Teachers for School in Pendurthi. Contact : 9494633698. AJV_192567

VACANT LAND FOR SALE

★ Vacant Land 400 sq.yds. 2nd Bit in B.C. Road, 20 feet Distance from Main Road Lane Opposite to Gantyada Bus Stop. Cont.: 9848190920 AJV_192581

LAND FOR SALE

★ అనకాపల్లికి 40 కి.మీ. దూరంలో 19 ఎకరాలు పామాయిల్ & 11 ఎకరాలు జీడి, టేకు మొక్కలు 3 బోర్లు, విడివిడిగా 4 ఎకరాలు లేదా 5 ఎకరాలు అమ్మకమునకు కలదు. సెల్: 8074144882. AJV_192566

★ 2 ఎకరాల మామిడితోట పూర్తి ఫెన్సింగ్ / గేట్ బోర్‌వెల్ మోటార్‌తో 40 మామిడి చెట్లు, 15 నుండి 20 సం. వయస్సు గల 900 టేకు చెట్లు & డెయిరీ ఫామ్ 900 Sft. షెడ్ @ 1.80 లక్షలకు (per cent) అమ్మకం. కిట్టన్నపేట సమీపంలో (Exclusive for farm house) 1.3 లక్షలకు (per cent). ఫోన్: 98483 72035. AJV_192558

SITE FOR SALE

★ కొత్తవలస జంక్షన్‌కి 1 కి.మీ. దూరంలో కె.కోటపాడు రోడ్డు, రాజపాత్రునిపాలెంలో 430 చ॥గ॥ల ఇంటి స్థలం అమ్మకంనకు కలదు. సంప్ర॥ 9553653999 AJV_192574

LEASE

★ For Long Lease Running Hospital, Near KGH. For Details Cont.: 80086 29333, 94401 39244 AJV_182573

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

వీధి విక్రయదారులకూ రుణాలు

- నాణ్యతతో కూడిన ఆహారం ప్రజలకు అందించాలి
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- శిక్షణ తరగతుల్లో మెప్మా, జీవీఎంసీ అధికారులు


శిక్షణ శిబిరానికి హాజరైన మెప్మా పీడీ సరోజిని, జీవీఎంసీ అధికారులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : పట్టణ ప్రజలకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని వీధి విక్రయదారులకు అధికారులు సూచించారు. శనివారం అనకాపల్లిలోని వీధి విక్రయదారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత మెప్మా పీడీ సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి విక్రయదారులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆహార పదార్థాల తయారు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వీధి విక్రయదారులకు రుణాలు కూడా మంజూరు చేస్తామని, అర్హులు జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఏపీడీని సంప్రదించాలని ఆమె కోరారు. జీవీఎంసీ పీడీ ఎంపీడీ ఫణిరామ్ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైనేజీలను ఆనుకుని వ్యాపారాలు చేయరాదని సూచించారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ అనకాపల్లి అంటే బెల్లం గుర్తుకొస్తుందని, అదేవిధంగా ఆహార పదార్థాల విషయంలో కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు గుర్తుంచుకునే విధంగా ఆహార తయారుచేసి, అమ్మకాలు చేయాలని సూచించారు. ఆహారాల్లో నాణ్యత లేకపోవడంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఏయూ ప్రొఫెసర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆహార పదార్థాలను విక్రయదారులు ఓపెన్‌గా ఉంచరాదన్నారు. ఏపీడీ వీకే దొరబాబు, నెస్టీలీ కంపెనీ ప్రతినిధులు ఎం.సత్యనారాయణ, వసీమ్ అహ్మద్, రాజీవ్, ప్రసన్నతో పాటు ఆహార భద్రతా విభాగం అధికారులు రవికుమార్, శ్రీజా తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

- నేవీ నిర్వాసిత మత్స్యకారులకు సీఐ నర్సింగరావు సూచన


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నర్సింగరావు

రాంబిల్లి, ఆగస్టు 3 : నేవీ నిర్వాసిత సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాంబిల్లి సీఐ నర్సింగరావు సూచించారు. మండలంలోని నేవీనిర్వాసిత గ్రామమైన వాడనర్సాపురంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో గల పైడమ్మ చెరువుకు సంబంధించిన సమస్యను ఐక్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించరాదన్నారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ల వాడకం తగ్గించేలా చూడాలని సూచించారు. మైనర్‌లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదన్నారు. ఇస్తే చట్టరీత్యా నేరంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా పంచాయతీల రికార్డులు

- గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు
- అంటువ్యాధులు ప్రబలకుండా అనుక్షణం అప్రమత్తం
- అధికారులు, కార్యదర్శులకు డీపీవో శిరీషారాణి ఆదేశం


ఎస్.రాయవరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో

ఎస్.రాయవరం, ఆగస్టు 3 : పంచాయతీల రికార్డులు పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి స్పష్టం చేశారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలోని పంచాయతీ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువల్లో పూడికలను తీయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించాలన్నారు. అనంతరం ఈవోపీఆర్డీ సత్యనారాయణ, డీఎల్‌పీవో మూర్తి, కార్యదర్శి సత్యనారాయణలకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ భూపతి అప్పారావు పంచాయతీలో సమస్యలు ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు డీపీవోను కలిశారు. గురజాడ షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన వేలం పాట త్వరగా నిర్వహించడమే కాకుండా దానికి సంబంధించి రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. అనంతరం ఆమె ధర్మవరం అగ్రహారంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు.

వీఆర్ఏల సమస్యలపై డీటీకి వినతి


డీటీకి వినతి పత్రాన్ని అందిస్తున్న సంఘం నాయకులు

ఎలమంచిలి, ఆగస్టు 3 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్ఏలు శనివారం డిప్యూటీ తహసీల్దార్ మురళీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు శివాజీ మాట్లాడుత వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు నిలుపుదల చేయాలని, అర్హులైన వారికి అటెండర్ వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌వో వంటి పోస్టులలో పదోన్నతులు కల్పించి నియమించాలని కోరారు. అలాగే, వీరికి కనీసం వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరసింహులు, అప్పారావు, వరలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కౌట్స్ శిక్షణ శిబిరం


స్కౌట్స్ శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో డీఈవో,

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : వారం రోజుల పాటు ఇక్కడి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో జరిగిన స్కౌట్ బేసిక్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండాలన్నారు. తద్వారా విద్యార్థులకు నీట్, మెడికల్, ఎంసెట్ వంటి వాటిలో రిజర్వేషన్లు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి చంద్రిక, జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి, డి.వేణుగోపాల్, షరీఫ్, ఆంథోని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న సాగునీటి కాలువల గేట్లు పరిశీలన

- మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతామన్న అధికారలు


ముతా కాలువ వద్ద గేట్లను పరిశీలిస్తున్న సాగునీటి శాఖ అధికారులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 3 : మండలంలోని పలు సాగునీటి కాలువలలో దెబ్బతిన్న గేట్లను శనివారం నీటిపారుదల శాఖాధికారులు పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి కాలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఇవి మరింత దారుణంగా తయారయ్యాయి. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది గుర్తించిన ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నీటిపారుదల శాఖ డీఈ జగదీశ్వరరావు, క్వాలిటీ విభాగం డీఈ ఎ.కృష్ణారావు, మెకానికల్ విభాగం డీఈ పి.గోపాలకృష్ణ తుని వద్ద ముతా ఆనకట్ట వద్ద మూడు గేట్లను పరిశీలించారు. గేట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయరుచేసి వాటి నిధుల కోసం జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. ముతా కాలువ నుంచి వంతుల వారీగా శ్రీరాంపురం తదితర ప్రాంతాలకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ జి.శ్రీరామ్మూర్తి, ముతా కాలువ మాజీ ఛైర్మన్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చింతలపు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా పోలేరమ్మతల్లి



కొత్తూరు, ఆగస్టు 3 : అనకాపల్లి పట్టణం శారదా నది ఒడ్డున ఉన్న పరశురామ్ పేటలోని గ్రామ దేవత పోలేరమ్మతల్లి శనివారం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారిని, ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పట్టణవాసులతో పాటు సమీప కొత్తూరు, సత్యనారాయణ పంచాయతీల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.అప్పారావు, సూరిబాబు, గణేష్, పరశురామ్, నానాజీ, శివ, అర్చకులు సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్పీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : పట్టణంలోని దాసరిగెడ్డ రోడ్డులో గల సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా బృందం ఏకాహం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఎలు రాజకీయపార్టీల నాయకులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం : బుద్ధ


జగదీశ్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక పెన్షన్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు డీఏతో కూడిన జీతాన్ని ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు అన్నారు. ఇక్కడి రింగురోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ సంఘం విశ్రాంత రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, అనకాపల్లి జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ మాట్లాడుతూ జీవో నంబరు 117ను రద్దు చేసి పేద విద్యార్థులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్ జగన్ అనాలోచిత పాలన వల్ల సుమారు ఐదు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకు దూరమయ్యారన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, ఆగస్టు 3 : ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలకు మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ శనివారం తెలిపారు. పదో తరగతి పాసై ఆసక్తిగల అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27వ తేదీలోగా పాయకరావుపేట ఐటీఐ కార్యాలయంలో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 29న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

పరవాడ, ఆగస్టు 3 : హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఇక్కడి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన మండల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. మండల మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, కో-కన్వీనర్ బొద్దపు పూర్ణ, ప్రతినిధులు దలాయి లక్ష్మి, పైలా శ్రీను, సంజీవరావు పాల్గొన్నారు.

డీవీఎన్ కళాశాలలో స్నేహితుల దినోత్సవం


ఫ్రెండిషిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న కళాశాల విద్యార్థులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : పట్టణంలోని దాడి వీరునాయుడు కళాశాలలో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది.

పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం

నక్కపల్లి, ఆగస్టు 3 : చినతీనార్లలో జనసేన నాయకులు చొక్కా ప్రసన్నకుమార్, కందాల శివాజీ ఆధ్వర్యంలో పాఠశాలలోని పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేశారు. అలాగే, నాలుగు కుర్చీలను బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. గరికిన నూకరాజు, కంబాల అమ్మోరియ్య, పిక్కి రాము, సిరిపిల్లి నూకరాజు, సింహాచలం, భవానీ, ప్రసాద్, ధనరాజు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు'

రాంబిల్లి, ఆగస్టు 3 : పీహెచ్‌సీల్లో రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో బాలాజీ ఆదేశించారు. శనివారం ఆయన దిమిలి పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి, రోగులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆర్.వెంకటేష్, బాలశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా

కోటవురట్ల, ఆగస్టు 3 : గొట్టివాడలోని వరహా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ రమణయ్య సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. అనం తరం తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా ఆయన రూ.పది వేలు జరిమానా విధించారు.

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

EP. 1/2022 in O.S.152/2010

కాండ్రేగుల నాగ వెంకట రమేశ్వరరావు ...DHR

అండ్

కాశరపల్లి ఉమా శ్రీనివాసరావు ...JDR

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో DHRకు రావలసిన అసలు బాకీ చెల్లించనందున JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తేది.20-08-2024న వేలం వేయుటకు శ్రీ కోర్టు వారు నిర్ణయించి యున్నారు. కావున ఆ రోజు ఉదయం 10.30 ని.లకు పై కోర్టుకు హాజరై కోర్టు వారి షరతుల ప్రకారం వేలం పాటలో పాల్గొనవలెను.

షెడ్యూల్ : విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్, మునగపాక మండలం, నాగులాపల్లి పంచాయతీ, నాగులాపల్లి గ్రామంలో గల సర్వే నెం.176/16లో య 0.62 సెంట్లు విస్తీర్ణం గల మెట్టు భూమికి హద్దులు : తూర్పు : [illegible], దక్షిణం : [illegible], పడమర : [illegible], ఉత్తరం : [illegible].

DHR విలువ : రూ.4,00,000/-

Amina విలువ : రూ.5,20,000/-

Market విలువ : రూ.22,36,000/-

JDR విలువ : Nil

M.V. రెడ్డినాయుడు, DHR తరపు అడ్వకేట్ అనకాపల్లి జిల్లా. సెల్ నెం.9247833057

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


సంబరాల్లో పాల్గొన్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

కశింకోట, ఆగస్టు 3 : సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణపై తీర్పు రావడంపట్ల స్థానిక గుబ్బం జాషువా యూత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం వారంతా ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎస్‌పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ కాలం పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుగా పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, కోశాధికారి చెవ్వేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'



ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు రాము

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 : ఎన్నికల ముందు విద్యార్థులకిచ్చిన హామీలను కూటమి ప్రభు త్వం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రాము కోరారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో రెండు రోజులు పాటు జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యా యి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. అన కాపల్లి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని, ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, విద్యాసంస్థలు వదిలే సమయాల్లో పలుచోట్ల విద్యార్థులను అల్లరి మూకలు ఏడిపిస్తున్నారని, వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని, ఖాళీగాఉన్న టీచర్ల పోస్టులు భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, కార్యదర్శి రమణ, నాయకులు రమణ, కేశవ, ధనలక్ష్మి, బాలాజీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు

'ఐ సపోర్ట్ డ్రగ్ ఫ్రీ ఏపీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, ఆగస్టు 3 : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సంస్థ చేపట్టిన 'ఐ సపోర్ట్ డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' పోస్టర్‌ను ఎంపీ సీఎం రమేష్ శనివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత క్షేమం నిమిత్తం చేపట్టిన ఈ కార్యక్రమానికి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు ధనుంజయ్ మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. అనంతరం ఎంపీ సీఎం రమేష్ తొలిసంతకం చేశారు.



గంగపుత్రుల వికాసంపై ఓ గ్రంథం

- దొండవాకకు చెందిన యువకుడు కోదండరావు రచన




కోదండరావు రచించిన పుస్తకం

నక్కపల్లి, ఆగస్టు 3 : మత్స్యకారుల పుట్టుక, వికాసం, అభివృద్ధిపై ఇదే సామాజికవర్గానికి చెందిన ఓ యువకుడు గ్రంథాన్ని రచించారు. త్వరలో ఇది హోంమంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా ఆవిష్కరణ కానుంది. ఈ సందర్భంగా గ్రంథ రచయిత నక్కపల్లి మండలం పెదతీనార్ల శివారు దొండవాక గ్రామానికి చెందిన పిక్కి కోదండరావు మాట్లాడుతూ తాను బీహార్ రాష్ట్రంలోని నవోదయ స్కూల్‌లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నట్టు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు సహా, అనేక రాష్ట్రాల్లో రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు మత్స్యకారులపై అధ్యయనం చేశానన్నారు. అనంతరం మత్స్యకారుల పుట్టుక, వికాసం, మత్స్య అనే పదానికి గల అర్థం, నిర్వచనం, గోత్రం, వంశం, పురాణాల్లో మత్స్యకారుల చరిత్ర నేపథ్యం, సంస్కృతీ సంప్రదాయాలు, మత్స్యకారుల మొత్తం ఉపకులాలు వంటి వాటిని గ్రంథంలో పేర్కొన్నట్టు వివరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత : ఎమ్మెల్యే సుందరపు


స్కేటింగ్ క్రీడాకారులతో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 3 : విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తు ఉజ్వ లంగా ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురంలో గల తన నివాసం వద్ద పలువురు స్కేటింగ్ క్రీడాకారులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించిమాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తగిన ప్రోత్సా హం అందిస్తుందన్నారు. విద్యార్థులు ఇటు చదువుతో పాటు అటు క్రీడల్లోనూ ప్రతిభ చూపితే ఉన్నతంగా ఉంటుందన్నారు. అనంతరం ఈ రంగంలో రాణించిన వారి గురించి వివరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో రేపు ఐదు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, ఆగస్టు 3 : పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో గల తాండవ షుగర్స్, చక్కానగర్ ఫీడర్ల పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా పట్టణంలోని బృందావనం, ధనిశెట్టినగర్, పండరీపురం, షీలానగర్, ఇందిరాకాలనీ, లింగాల కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, దుర్గానగర్, దుర్గాకాలనీ, శాంతినగర్, పెదిరెడ్డి లక్ష్మీనగర్, దేవీనగర్, చక్కానగర్, ఆనంద్‌నగర్ కాలనీ, శ్రీప్రకాష్ కాలేజీ ఏరియా, దొర కాలనీతోపాటు మండలంలోని పీఎల్‌పురం, సీతారాంపురం, నామవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

ఆంధ్రజ్యోతి

విలేఖరులు కావలెను

- అనకాపల్లి అర్బన్ • అనకాపల్లి నెహ్రూ చౌక్
- మునగపాక • కశింకోట • ఎలమంచిలి రూరల్
- నర్సీపట్నం టౌన్ • చోడవరం టౌన్

.. పైన పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు విలేఖరులు కావలెను.

అభ్యర్థులు డిగ్రీ/ఇంటర్ చదివి ఉండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8-8-2024 (గురువారం) ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

అడ్రస్: ఆంధ్రజ్యోతి కార్యాలయం

పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎస్.హెచ్-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం. ఫోన్ : 2549123

కష్టాలు తీరేదెన్నడో?


ధర్మాకోల్ సాయంతో నదిదాటుతున్న రైతు (ఫైల్)

... 5వ పేజీ తరువాయి

సాగిస్తున్నామన్నారు. చెరకు క్రషర్లు కూడా నది అవతల ఉండడంతో రాత్రి వేళల్లో అతి కష్టమ్మీద దాటాల్సి వస్తోందని చెబుతున్నారు. నది దాటి వెళ్లే వారు ఇంటికి వచ్చే వరకు ఆ కుటుంబ సభ్యులు భయం భయంగా గడుపుతుంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతుంటారు. ఇప్ప టికైనా ప్రజాప్రతిని ధులు, అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరు తున్నారు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి

... 5వ పేజీ తరువాయి

ఉందన్నారు. అక్కడే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్షియల్ ఏరియా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించాల్సి ఉందన్నారు.

అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్

మధురవాడలో అందుబాటులో ఉన్న స్థలంలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. యువతను ఎక్కువగా ఆకట్టుకుంటున్న ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడా వినోదం అందిస్తామన్నారు. ఇది సాధారణ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్లకు భిన్నంగా ఉంటుందన్నారు.

• ఎన్ఏడీ జంక్షన్‌లో ఆర్‌టీబీతో పాటు సబ్ వే కూడా నిర్మించాలని కోరుతున్నారని, త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. భీమలాపల్లి, ఎండాడల్లో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు.

అందరితో చర్చించి మాస్టర్ ప్లాన్ రహదారులు

ప్రస్తుతం వీఎంఆర్డీఏ రెండు మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, ఇంకా ఎక్కడెక్కడ అవసరమో ఏపీఐఐసీ, టూరిజం, నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అన్నింటికి ఆన్‌లైన్ పేమెంట్

వీఎంఆర్డీఏకు వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలు, చిల్డ్రన్ ఎరీనా, పార్కులు, మ్యూజియాలు ఉన్నాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదని ఆలోచించి ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడతామన్నారు.

సిబ్బంది భర్తీకి చర్యలు

సంస్థలో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని, దాంతో పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పనులు ఏమీ జరగడం లేదని వివరించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, వీఆర్‌ఓ పోస్టులు వంటివి భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసి, వెబ్‌సైట్‌ను మరింత జనరంజకంగా మార్చి, సోషల్ మీడియాలో కూడా వీఎంఆర్డీఏ ఉండేలా చేస్తామన్నారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి

» పోలీసులకు జడ్జి రత్నకుమార్ సూచన



పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశమైన జస్టిస్ రత్నకుమార్

చోడవరం, ఆగస్టు 3 : రాజీకి అవకాశం ఉన్న కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమయ్యేలా పోలీసులు శ్రద్ధ వహించాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో కోర్టు పరిధిలోని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ పడదగ్గ కేసులను గుర్తించి వారు రాజీ అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించడం ద్వారా లోక్ అదాలత్‌లలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.స్వర్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, ఏపీపీ వేసలపు వెంకటరావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నర్సీపట్నం, ఆగస్టు 3 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి పలు సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్స్, ఫిజికల్ డెరెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుకు ఎంఎస్సీ కెమిస్ట్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణ సాధించి ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ పోస్టుకు ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్/ ఎంసీఏ/ ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు ఎంపీఈడీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈ నెల 7 సాయంత్రం 5 గంటలు లోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. 9వ తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. డెమో, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

50 పడకల ఆస్పత్రిగా సీహెచ్‌సీ : సీపీఎం డిమాండ్



రోగులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

చోడవరం, ఆగస్టు 3 : పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చి మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. శనివారం స్థానిక సీహెచ్‌సీని ఆయన సీపీఎం నేతలతో కలిసి సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలకు కీలకమైన కమ్యూనిటీ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌వీ నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రాంతాల్లో ముందస్తు వైద్య సేవలు అవసరం

నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజ్ ఖాన్



వైద్యశిబిరంలో పాల్గొన్న జడ్జి పటాన్ సియాజ్ ఖాన్

నాతవరం, ఆగస్టు 3 : గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజ్ ఖాన్ కోరారు. శనివారంనాతవరం మండలం సరుగుడు గిరిజన గ్రామంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రశాంతి, స్థానిక వైద్యాధికారి ప్రసన్న డా.రాజేష్‌నాయుడు, నర్సీపట్నం బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మెట్టా ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ కోసూరు అప్పలనాయుడు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, లాయర్ ఎస్.కన్నయ్యనాయుడు, బైరాగి, పెదబాబు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

విలేఖరులు కావలెను

● అనకాపల్లి అర్బన్ ● అనకాపల్లి నెహ్రూ చౌక్
● మునగపాక ● కశింకోట ● ఎలమంచిలి రూరల్
● నర్సీపట్నం టౌన్ ● చోడవరం టౌన్

.. పైన పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు విలేఖరులు కావలెను.
అభ్యర్థులు డిగ్రీ/ఇంటర్ చదివి ఉండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి.
ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8-8-2024 (గురువారం) ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

అడ్రస్: ఆంధ్రజ్యోతి కార్యాలయం
పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎస్.హెచ్-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం. ఫోన్ : 2549123

శ్రుతిమించుతున్న 'కోతి చేష్టలు'

» ఇళ్లల్లోకి సైతం దూసుకొస్తున్న కోతులు
» దుకాణాల వద్ద సామగ్రి ఎత్తుకొని పరారీ
» రైతులు వేసే పంటలపై దాడి
» కొన్నిసార్లు పిల్లలు, వృద్ధులపై ప్రతాపం



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు



ఇళ్ల గేట్ల ముందు పచార్లు కొడుతూ..

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో రోజూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రోజు వారీ కార్యకలాపాలపై బయటకు వచ్చే ప్రజలు ఈ కోతుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగశింగి, విప్పలపాలెం, పల్లావూరు, రేఖపల్లి తదితర గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. దుకాణాల వద్ద సామగ్రి, రైతులు పండించే పంటలు నాశనం చేస్తుంటాయి. కొన్నిసార్లు ఇళ్లల్లోకి కూడా ప్రవేశిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పగటి పూట పనుల్లో నిమగ్నమై ఉంటే ఎవరూ లేని సమయాల్లో వంట గదుల్లోకి ప్రవేశించి కూరగాయలు తినడం, సామగ్రి చిందరవందర చేయడం వంటి చేష్టలకు పాల్పడుతుంటాయని చెబుతున్నారు. అనేక సార్లు చడీచప్పుడు చేయకుండా వంట గదుల్లో ప్రవేశిస్తుంటాయని, అటు తిరిగి పనిలో ఉంటే మహిళలు ఇటు తిరిగే సరికి ఉన్నపళంగా కోతిని చూసి బెదిరిపోయే సంఘటనలు ఉంటున్నాయని అంటున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు వినతులు సమర్పించినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. గడపల్లోకి ప్రవేశించి నానా హంగామా చేసే వీటిని చూసి చిన్న పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని అంటున్నారు. చిన్నారుల చేతుల్లో ఉంటే తినుబండారాలను సైతం లాక్కొని పారిపోతుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. ప్రతిరోజు కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కోతులు దాడిలో నిత్యం పదుల సంఖ్యలో బాధితులు ఉంటున్నారని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి కోతులు నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

» పత్రాలు లేకుంటే చర్యలు : ఎస్‌ఐ ఉపేంద్ర



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ఉపేంద్ర

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 : వాహనదారుల వద్ద లైసెన్స్, సీ-బుక్ ఇతర అన్నిరికార్డులు తప్పనిసరిగా ఉండాలని, లేని పక్షంలో కేసులు నమోదు తప్పవని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర అన్నారు. శనివారం కృష్ణాదేవిపేట పోలీస్ చెక్‌పోస్టు వద్ద తదితర ప్రాంతాల్లో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిరిగా ధరించాలన్నారు. పూర్తి స్థాయిలో రికార్డులు లేనిపక్షంలో వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గురుమూర్తి, హెచ్‌సీ రమణ, దుర్గాప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో విధులు వద్దు

» వీఆర్‌ఏల విజ్ఞప్తి



హెచ్‌డీటీ అరుణ్‌చంద్రకు వినతి పత్రాన్ని అందచేస్తున్న వీఆర్‌ఏలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3 : తహసీల్దార్ కార్యాలయంలో నైట్ డ్యూటీల నుంచి తమను మినహాయించాలని కోరుతూ, శనివారం హెచ్‌డీటీ అరుణ్‌చంద్రకి మండల గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)లు వినతిపత్రాన్ని అందజేశారు. తమను రాత్రివేళల విధుల నుంచి మినహాయిస్తూ గతంలో ఇచ్చిన ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఇప్పుడు డ్యూటీలను వేయడం తగదన్నారు. అలాగే అర్హత కలిగిన వీఆర్‌ఏలకు అటెండరు, నైట్ వాచ్‌మెన్లగా పదోన్నతి కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘాధ్యక్షుడు బొడ్డు శ్రీను, ఉపాధ్యక్షులు బండి రామారావు, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లి హృదయం

» తెల్లవారు జామున దూడను ఢీకొట్టిన కోళ్లు వ్యాన్
» కాలు నుజ్జవడంతో లేవలేని స్థితిలో కూలబడిపోయిన మూగజీవి
» దూడ వద్ద గంటల తరబడి నిల్చొన్న తల్లి ఆవు



తీవ్రంగా గాయపడిన దూడ వద్ద నిలబడి ఉన్న తల్లి ఆవు

నర్సీపట్నం, ఆగస్టు 3 : తీవ్రంగా గాయపడిన లేగ దూడ వద్ద తల్లి ఆవు దీనంగా నిలబడి కన్నీళ్లు పెట్టుకొంది. ఆ దృశ్యాన్ని చూసిన వారు చలించిపోయారు. అక్కడ ఉన్న వారి గుండెలు బాధతో బరువెక్కాయి. వివరాలిలా ఉన్నాయి.

ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి గుడి ఎదురుగా శనివారం వేకువ జామున గుర్తు తెలియని కోళ్ల వ్యాన్ లేగ దూడను ఢీ కొట్టి వెళ్లిపోయింది. దూడ కాలు నుజ్జు నుజ్జు కావడంతో నిలబడ లేక రోడ్డు మీద కూలబడి పోయింది. తీవ్రంగా గాయపడిన దూడ వద్దకు తల్లి ఆవు చేరుకొని ఆవేదనతో దాని చుట్టు తిరిగింది. గంటల తరబడి దీనంగా చూస్తూ ఉండిపోయింది. 'ఎవరైనా సహాయం చేయకపోతారా' అన్నట్టు తల్లి ఆవు దిక్కులు చూడటం అక్కడ ఉన్న వారిని కలచి వేసింది. తల్లి మనస్సు తల్లడిల్లి పోవడం చూసి అయ్యో పాపం అనిపించింది. ఆ దృశ్యాన్ని చూసిన కొందరు కంటతడి పెట్టారు.

సమాచారం అందుకున్న పశు సంవర్థశాఖ ఏడీ డబ్ల్యూ.రాంబాబు 1962 అంబులెన్స్ వాహనంతో పశువుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దూడకు వైద్యం అందిస్తున్నారు.

దమ్ములు, వరినాట్లుతో రైతులు బిజీ



పాతమల్లంపేటలో దమ్ములు చేస్తున్న దృశ్యం

గొలుగొండ, ఆగస్టు 3 : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దమ్ముల్లో బిజీగాఉన్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడడంతో పాతమల్లంపేట, జోగంపేట, గొలుగొండ, పాకలపాడు, ఏటిగైరంపేట, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, అమ్మపేట గ్రామాల్లో ముమ్మరంగా దమ్ముల పనులు చేపడుతున్నారు. పాతమల్లంపేట, పాకలపాడు, అమ్మపేట గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడడంతో చెరువులు నిండాయని, గెడ్డల్లో నీటి ఉధృతులు పెరిగాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరినాట్లకు కూలీల కొరత

రైతులకు భారంగా పెరిగిన కూలి రేట్లు



వరినాట్లు వేస్తున్న కూలీలు

మాకవరపాలెం, ఆగస్టు 3 : మండలంలో వర్షాలు కురవడంతో ఒకే సారీ వరిదమ్ములు ప్రారంభం కావడంతో వరినాట్లు వేసే కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం, మల్లవరం, గిడుతూరు గ్రామాల్లో ముమ్మరంగా ముమ్మరంగా వరి దమ్ములు ప్రారంభమయ్యాయి. దీంతో ఒక్కసారిగా వరినాట్లు వేసే కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. ఫలితంగా కూలి రేట్లు పెంచెస్తున్నారు. ఇది రైతులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు ధరలు తడిసి మోపెడు కావడం, ఇప్పుడు కూలీలు కొరతతో కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. వరినాట్లు వేసే మహిళా కూలీలకు రోజుకు రూ.350, ఆటో చార్జీలు, పురుషులకు రూ.600, మద్యం సీసాతో పాటు ఆటో చార్జీలు, దమ్ము పట్టే ట్రాక్టర్‌కు గంటకు రూ.1000, అలాగే ఎరువుల ధరలు పెరగడంతో తమ పరిస్థితి దారుణంగా ఉందంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. అదను దాటితే వరినాట్లు వేయలేమని పక్క మండలాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. ఇది మరింత వ్యయప్రయాసలకు గురి చేస్తోంది. దీంతో ఈ ఏడాది ఖర్చు విపరీతంగా పెరిగిందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

కష్టాలు తీరేదెన్నడో?



ధర్మాకోల్ షీట్ సహాయంతో నదిని దాటుతున్న రైతు (ఫైల్ ఫొటో)

.. 5వ పేజీ తరువాయి

సాగిస్తున్నామన్నారు. చెరకు క్రషర్లు కూడా నది అవతల ఉండడంతో రాత్రి వేళల్లో అతికష్టమ్మీద దాటాల్సి వస్తోందని చెబుతున్నారు. నది దాటి వెళ్లే వారు ఇంటికి వచ్చే వరకు ఆ కుటుంబ సభ్యులు భయంభయంగా గడుపుతుంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతుంటారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం

» రిటైర్డు జస్టిస్ సన్యాసిరావు



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు జడ్జి సన్యాసిరావు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3 : అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలని రిటైర్డు జడ్జి, చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్ నడుపూరు సన్యాసిరావు అన్నారు. శనివారం వడ్డాదిలోని ఎస్సీ బాలుర హాస్టల్స్‌లో 110 మంది విద్యార్థులకు ట్రస్ట్ అందజేసిన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బోధించు, సహకరించు, పోరాడు అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఉన్నత విద్యాభ్యాసాలతోనే లక్ష్య సాధన సాధ్యమని చెప్పారు. ఈ సమావేశంలో ట్రస్ట్ నిర్వాహకులు కండెల్లి వెంకట్రావు, సభ్యులు జె.అప్పారావు, పి.పైడిరాజు, డి.సుందరరావు, ప్రకాష్‌రావు, హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన అన్నవరం దేవస్థానం చైర్మన్



నర్సీపట్నం, ఆగస్టు 3 : అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ శనివారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌కు శాలువ కప్పి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేడు ఏఎల్‌పురంలో ఉచిత వైద్యశిబిరం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 : ఏఎల్‌పురం పీహెచ్‌సీ వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ వైద్యశిబిరంలో అన్ని రోగాలకు సంబంధించిన విశాఖపట్నానికి చెందిన 10 మంది ప్రముఖ వైద్యులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులు ఇవ్వనున్నట్లు మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఏఎల్‌పురం ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ప్రజలను కోరారు.

తూటిపాల పాఠశాలలో అవయవదాన దినోత్సవం



చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం, ఆగస్టు 3 : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం అవయవ దానం దినోత్సవాన్ని నిర్వహించారు. మనిషి శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, కంటిలోని కార్నియా, కిడ్నీలు, ప్యాంక్రియాస్, గుండె కవాటాలు, కాలేయం వంటి అవయవాలను దానం చేయవచ్చని హెచ్‌ఎం కోసూరు రాము తెలిపారు. అనంతరం విద్యార్థులు వివిధ అవయవాలను చార్టులు ద్వారా ప్రదర్శించారు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి

... 5వ పేజీ తరువాయి

ఉందన్నారు. అక్కడే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్షియల్ ఏరియా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించాల్సి ఉందన్నారు.

అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్

మధురవాడలో అందుబాటులో ఉన్న స్థలంలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. యువతను ఎక్కువగా ఆకట్టుకుంటున్న ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడా వినోదం అందిస్తామన్నారు. ఇది సాధారణ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్లకు భిన్నంగా ఉంటుందన్నారు.

● ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఆర్‌టీతో పాటు సబ్ వే కూడా నిర్మించాలని కోరుతున్నారని, త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. చీమలాపల్లి, ఎండాడల్లో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు.

అందరితో చర్చించి మాస్టర్ ప్లాన్ రహదారులు

ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ రెండు మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, ఇంకా ఎక్కడెక్కడ అవసరమో ఏపీఐఐసీ, టూరిజం, నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అన్నింటికి ఆన్‌లైన్ పేమెంట్

వీఎంఆర్‌డీఏకు వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలు, చిల్డ్రన్ ఎరీనా, పార్కులు, మ్యూజియాలు ఉన్నాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదని ఆలోచించి ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడతామన్నారు.

సిబ్బంది భర్తీకి చర్యలు

సంస్థలో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని, దాంతో పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పనులు ఏమీ జరగడం లేదని వివరించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, వీఆర్‌ఓ పోస్టులు వంటివి భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసి, వెబ్‌సైట్‌ను మరింత జనరంజకంగా మార్చి, సోషల్ మీడియాలో కూడా వీఎంఆర్‌డీఏ ఉండేలా చేస్తామన్నారు.

☛ సంక్షిప్తంగా..

నేడు వడ్డాదిలో మారథాన్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3 : ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఆదివారం ఉదయం 6 గంటలకు 2.5 రన్ మారథాన్ నిర్వహించనున్నట్టు అమ్మ హెల్పింగ్ హార్ట్ గ్రామీణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానం నుంచి కేబీ రోడ్డులో నిర్వహించనున్న రన్ మారథాన్‌లో యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. మొదటి మూడు స్థానాలో నిలిచిన విజేతలకు నగదు పురస్కారాలతో పాటు తర్వాత స్థానాల్లో నిలిచిన మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ



కాలువల్లో పూడిక తీస్తున్న సిబ్బంది

గొలుగొండ, ఆగస్టు 3 : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. జోగంపేట, సాలికమల్లవరం, గొలుగొండ, పాతమల్లంపేట గ్రామాల్లో శనివారం డ్రైనేజీ కాలువల్లో పూడికతీత తీశారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని కార్యదర్శులు రఘురాం, వెంకటరమణ, రమణమ్మ సూచించారు.

నేడు కేజేపురంలో మోదకొండమ్మ పండగ

మాడుగుల రూరల్, ఆగస్టు 3 : మండలంలోని కేజేపురంలో మోదకొండమ్మ అమ్మవారు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేస్తారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామంలో జరిగే జాతరకు వచ్చారు. గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఆలయానికి రంగులు వేశారు. పండగ సందర్భంగా పలు జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఐటీఐ మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, ఆగస్టు 3 : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లు భర్తీ కోసం మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్‌కు ఈనెల 26 వరకు గడువు ఉందని తెలిపారు. 27న సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించడానికి గడువు తేదీ అని తెలిపారు. అభ్యర్థులు ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ ఎట్టి పరిస్థితిలోనే మార్చకూడదని, ఆధార్, ఎస్సెస్సీ సర్టిఫికెట్ అవసరమని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 8790741378/ 89772 72231లో సంప్రదించాలని కోరారు.

సమస్యలు తెలెత్తకుండా చర్యలు

నర్సీపట్నం, ఆగస్టు 3 : ఇటీవల వర్షాలు విరివిగా పడుతున్నందున వార్డుల్లో కలుషిత తాగునీరు సరఫరా కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ పూడి రవిబాబు సిబ్బందిని ఆదేశించారు. శనివారం కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వార్డులలో వీధిలైట్లు సమస్యను త్వరగతిన పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ



పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

చోడవరం, ఆగస్టు 3 : అసాంఘిక చర్యలు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ బి.శ్రీనివాసరావు రౌడీషీటరు, పాత నేరస్థులను హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్థులకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, గొడవలు నేరాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించామని, నేరాలు జరగకుండా రాత్రి వేళల్లో గస్తీ మరింత పెంచామని సీఐ తెలిపారు.


తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ



భారీ ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో ఉషారాణి తదితరులు

రావికమతం, ఆగస్టు 3 : తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా శనివారం రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అధికారులు, అంగన్‌వాడీలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బి.ఉషారాణి మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు పాలివ్వడం వరంలా భావించాలన్నారు. బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ప్రధాన ఆధారమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్ వైజర్‌లు,సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని చోడవరం, బుచ్చియ్యపేట, రావికమతం మండలాల్లో ఈ వారోత్సవాల సందర్భంగా చురుగ్గా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలు, ఆయాలకు ప్రోత్సాహకాలతో అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి కేజీబీవీ బాలిక ఎంపిక



రోలుగుంట, ఆగస్టు 3 : రోలుగుంట కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థి బొట్టా హేమలత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు విద్యాలయం ప్రత్యేకాధికారి తులసి తెలిపారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో హేమలకు సీటు లభించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా హేమలతను విద్యాలయం ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.